క్లుప్తంగా

రజక సంఘం అధ్యక్షుడిగా నాగభూషణం


నాగభూషణంకు స్వీట్లు తినిపిస్తున్న నాయకులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి పట్టణ రజక సంఘం అధ్యక్షుడిగా విరివాడ నాభూషణం ఎన్నికయ్యారు. సత్తుపల్లి చాకలి ఐలమ్మ మోడ్రాన్ దోబీఘాట్ భవనంలో ఆదివారం పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 669 ఓట్లకుగాను 309 ఓట్ల మెజార్టీతో విరివాడ నాగభూషణం విజయం సాధించాడు. అనంతరం నాగభూషణంకు ఎన్నికల అధికారులు మూడేళ్ల పదవి కాలానికి గాను ధ్రువీకరణ పత్రం అందించారు. ఈ సందర్భంగా నాగభూషణంకు ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్, ఎండి.కమల్‌పాషా, గాదె చెన్నారావు, సందీప్, పంతంగి నర్సింహారావు, ఎన్.సత్యనారాయణ, ఈలప్రోలు రాంమూర్తి, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, ఏసుబాబు, ప్రభాకర్, చెన్నారావు, కోటేశ్వరరావు, గజ్జల శ్రీను అభినందించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తల్లాడ: మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో జరిగే మూడు విప్లవ కమ్యూనిస్టు పార్టీల ఐక్య జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం కేశ్వాపురంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు ఎస్‌కె.లాల్‌మియా, ఎన్.వెంకటకుమారి, అనీల్, మరియమ్మ, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం


వైద్య సేవలు అందజేస్తున్న అంజద్ షరీఫ్

మధిరరూరల్: దెందుకూరు హైస్కూల్ ఆవరణలో ఆదివారం షిఫా ఛాతి అండ్ మెటర్నిటీ హాస్పిటల్ మధిర వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. డాక్టర్ మహమ్మద్ అంజద్ షరీఫ్ పాల్గొని వివిధ రకాల వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

కళాజాత


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

బోనకల్: మండలంలోని రాయన్నపేట, చొప్పకట్లపాలెం, చిన్నబీరవల్లి, లక్ష్మీపురం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీల్లో పూర్వ ప్రాథమిక విద్యపై ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కళాజాత నిర్వహించారు. ఆటపాటలు, నాటకాలతో ప్రభుత్వం అందజేస్తున్న సేవలను వివరించారు. ప్రభుత్వం అందజేస్తున్న పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం ఎఫర్ట్ సంస్థ 5 గ్రామాలలోని అంగన్‌వాడీ సెంటర్‌లకు సస్‌టీవీ చైల్డ్ రైట్స్ అండ్ యూ సంస్థ సహకారంతో మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు తెలిపారు. సంస్థ సభ్యులు సురేష్, కోటి, అరుణ, కరుణ, అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, రమ పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ అసోసియేషన్ ఎన్నిక


సమావేశంలో పాల్గొన్న ఎలక్ట్రీషియన్లు

మధిర: మధిర మండల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్‌ను ఆదివారం స్థానిక రైల్వే గేట్ వద్ద నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కూరపాటి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, కోశాధికారిగా వేమిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శిగా రఘు, సహాయ కార్యదర్శిగా ఆశీర్వాదంతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ మజీద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్. హనుమంతరావు పాల్గొన్నారు.

ఏఎస్సై మృతి

మధిరరూరల్: మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న జి.వెంకన్న(59) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. ఖమ్మంలోని ఆయన నివాసంలో ఉండగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకుని వెళుతుండగా మృతి చెందినట్లు తెలిసింది. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపై మధిర సీఐ జాటోత్ వసంత్ కుమార్, రూరల్ ఎస్సై రఫీ సంతాపం తెలిపారు.



ఎర్ర బంగారం పండించి లాభాలు గడిద్దామనుకున్న రైతులకు నిరాశే ఎదురైంది. తాలు కాయలు ఎక్కువగా ఉండడంతో మూలంగా ఈ ఏడాది తీవ్రంగా నష్టపోతున్నారు. సాధారణంగా ఎకరానికి క్వింటా తాలు రావాల్సి ఉండగా ఈ ఏడాది రెండు క్వింటాళ్లకు పైగానే వస్తోంది. కొన్ని తోటల్లో అంతకు రెట్టింపు స్థాయిలో తాలు మిగులుతోంది. దీంతో ఈ ఏడాది కూడా మిర్చి రైతులు నష్టాలను చవి చూడాల్సి వస్తోంది.

అంతా తాలే..

ఎర్రబంగారంపై తాలు మిర్చి దెబ్బ

- ఎకరానికి 2 క్వింటాళ్లు పైగానే..
- నష్టపోతున్న రైతులు
- కూలీల ఖర్చే అధికం


తాలుకాయలను వేరు చేస్తున్న కూలీలు

తల్లాడ: గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉన్నప్పటికీ కాయలు కోసిన తర్వాత కల్లాల్లో తాలు శాతం ఎక్కువగా వస్తోంది. దీంతో తాలు కాయలకు మార్కెట్‌లో సగంరేటు మాత్రమే ఉండటం వల్ల మిర్చిలో ఆదాయం తగ్గిపోతుంది. తల్లాడ మండలంలో ఈ ఏడాది 6,500 ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. గత ఏడాది జులై నెలాఖరులో సాగు చేసిన మిర్చి పైరు ఈ ఏడాది జనవరి 15 తర్వాత కోతలు ప్రారంభించారు. ఈ ఏడాది మిర్చి పైరు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఓరిజనల్‌తో పాటు తాలు కాయలు ఎక్కువగా వస్తుండటంతో నష్టం ఏర్పడుతుంది.

ఎకరానికి రూ.1.50 లక్షల పెట్టుబడి..

ఈ ఏడాది మిర్చి రైతులు ఎకరానికి రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టారు. నారు, దుక్కి దున్నడం, మిర్చిలో పై మందులు, పాటు చేయడం, మందు కట్టలు, కలుపు కూలీలు, మిరపకాయలు కోసినందుకు అంతా కలిపి ఎకరానికి రూ.1.50 లక్షలు ఖర్చువుతుంది. కౌలు రైతులకైతే అదనంగా మరో రూ.30 నుంచి రూ.40 వేలు కౌలు భారం పడుతుంది. నీటి వసతి లేని వారికి నీటి కౌలు మరో రూ.10 వేలు ఎకరానికి ఖర్చువుతంది.

తేజరకం మిర్చియే అధికం..

తల్లాడ మండలంలో ఈ ఏడాది తేజరకం మిర్చియే అధికంగా సాగు చేశారు. 80 శాతం మంది రైతులు తేజ రకం మిర్చిని సాగు చేయగా మిగిలిన వారు ఇతర రకాలను సాగు చేశారు. డిసెంబరులో వచ్చిన తుఫాన్ వల్ల మిర్చి తడిసిపోయి తాలెక్కువగా రావడంతో పాటు నల్ల తామర, ఎర్ర నల్లి బాగా ఆశించింది. దీంతో మిరప కాయలు తాలుగా మారాయి. మిర్చి పైరు కోతకొచ్చే వరకు రైతుకు ఈ విషయం తెలియదు. ఈ సంవత్సరం మిర్చి బాగానే కాసిందనుకున్న రైతులకు తాలు శాతం ఎక్కువగా వస్తుండటంతో ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో పడ్డారు. మండలంలో తేజ రకం మిర్చి సాగు చేసిన రైతులపై తాలు ప్రభావం బాగా పడింది.

ఎకరానికి రెండు క్వింటాళ్లకు పైగానే..

మిర్చి మొదటి కోతలోనే ఎకరానికి రెండు క్వింటాళ్లకు పైగానే తాలెల్లుతోంది. కోసిన తర్వాత రెండు రోజులు కల్లాల్లో ఆరబెట్టిన వెంటనే తాలుకాయలను ఏరించాల్సి వస్తోంది. గతంలో రైతు కుటుంబం మొత్తం తాలు కాయలు ఏరు చేయడానికి సరిపోతే ఈ ఏడాది ప్రత్యేకంగా కూలీలను పెట్టాల్సి వస్తోంది. మొదటి కోతలోనే ఇలా ఉంటే రెండో కోతలో మరింత తాలు కాయ ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఈ సంవత్సరం తాలెక్కువే..



గత ఏడాది కంటే ఈ సారి మిర్చితోటల్లో తాలు కాయలు ఎక్కువగా వస్తున్నాయి. దీంతో కూలీలను పెట్టిమరీ ఏరించడంతో ఖర్చు అధికమౌతుంది. గత డిసెంబర్‌లో కురిసిన తుఫాన్ వల్లనే తలు ఎక్కువగా కనిపిస్తుంది.

– దగ్గుల శ్రీనివాసరెడ్డి, రైతు, తల్లాడ

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు..



మునుపెన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం సగం వరకు తాలు కాయలు రావడంతో కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎకరానికి రూ.1.50 లక్షల పెట్టుబడి అయింది. తాలు కాయలే ఎక్కువ అవడంతో నష్టం వచ్చేలా ఉంది.

– పూల సైదేశ్వరరావు, రైతు, తల్లాడ

సగం నష్టపోవాల్సిందే..



మొదటి కోతలో ఎకరానికి ఆరు క్వింటాళ్ల దిగుబడి వస్తే అందులో రెండు క్వింటాళ్లు తాలు కాయలు వచ్చాయి. తాలు కాయలు రేటు రూ.10 వేలు మాత్రమే.. దీంతో సగం నష్ట పోవాల్సి వస్తోంది. మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– మొక్కా శివమణి, మహిళా రైతు

చట్టసభల్లో స్థానం కల్పించాలి


మాట్లాడుతున్న రమాదేవి

బోనకల్: విశ్వ బ్రాహ్మణులకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలని విశ్వ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి దేవరకొండ రమాదేవి కోరారు. మండల కేంద్రంలో ఆదివారం సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రావుట్ల వెంకటాచారి, ప్రధాన కార్యదర్శిగా తాటికొండ విశ్వజ్ఞాచారి, కోశాధికారిగా బ్రహ్మం, ఉపాధ్యక్షుడిగా వెంకట నరిసింహాచారితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన మహిళా కమిటీ అధ్యక్షురాలిగా కల్యాణి, ప్రధాన కార్యదర్శిగా దుర్గా, కోశాధికారిగా పంతంగి రమాదేవితో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి విశ్వ బ్రాహ్మణులకు అందాల్సిన సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుట్ల సత్యనారాయణ, అలవాల నాగేశ్వరరావు, రవీంద్రాచారి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న పుల్లయ్య

చింతకాని: నల్లగొండలో రేపు(మంగళవారం) జరిగే బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభను అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అన్నారు. మండల పరిధిలోని లచ్చగూడెంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం నాగార్జునసాగర్ ప్రాజెక్టును కేఆర్‌ఎంబీకి అప్పగిస్తే జరిగే నష్టాన్ని వివరించేందుకే సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి రూ.2 లక్షల రుణమాఫీ, వరికి రూ.500 బోనస్ వంటి హామీలపై బీఆర్‌ఎస్ అధిష్టానం సభ ద్వారా ప్రభుత్వాన్ని నిలదీయటం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టర్ వంకాయలపాటి లచ్చయ్య, యువజన విభాగం అధ్యక్షుడు పిన్నెల్లి శ్రీనివాసరావు, మండల నాయకులు పాపినేని రంగారావు, పోట్ల సీతయ్య, వెంకటేశ్వర్లు, మాధవరావు, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం..


సత్తుపల్లి: ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సత్తుపల్లి: సత్తుపల్లి ప్రభుత్వ ఎస్‌బీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 1983–85 ఇంటర్ పూర్వ విద్యార్థులు ఆదివారం 41 ఏళ్ల తర్వాత కలుసుకొని సంతోషాలను పంచుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు జీవిడి కృష్ణమోహన్ పూర్వ విద్యార్థులందరికి మెమోంటోలను అందించారు. ఈ కార్యక్రమానికి కూకులకుంట రవి అధ్యక్షత వహించగా దామెర రమేష్, మునగాల వెంకటేశ్వరరావు, చిన్నంశెట్టి సురేష్, బండి రమణారెడ్డి, ఆర్.వీరాస్వామి, ఎస్.మంగయ్య, జ్యోతిశ్రీ, ఢిల్లీలత, విమల, త్రివేణి, ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.


ఏన్కూరు: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

ఏన్కూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1991–92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. మూడు దశాబ్దాల తరవాత కలిసిన మిత్రులు ఆప్యాయంగా పలకరించుకోని రోజంతా చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు.

పదోన్నతులు కల్పించండి


భట్టిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, వైద్యులు

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలోని ప్రభుత్వ డెంటల్ డాక్టర్లకు పదోన్నతులు కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యాన రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కోరారు. ఈ మేరకు ఆయన్ని హైద్రాబాద్‌లో ఆదివారం కలిసి సన్మానించారు. సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రి డెంటల్ వైద్యులు ఆర్.స్రవంతితో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దంత వైద్యులతో భట్టికి వినతిపత్రం అందించారు. వారి సమస్యపై సానుకూలంగా స్పందిస్తామన్నారు. త్వరలో నిర్ణయం తీసుకొని ప్రభుత్వం ప్రకటిస్తుందని తెలిపారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం


పూజలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

మధిర: మధిర శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షులు కపిలవాయి జగన్మోహన్‌రావు వాసవి మాత పతాకాన్ని ఆవిష్కరించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసుల శేషాచార్యుల వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనుబోతు మాలతి ఆధ్వర్యంలో భక్తి గీతాలు, అన్నమాచార్య కీర్తనలు ఆలపించారు. వాసవి మాతకు 102 జ్యోతులు వెలిగించారు

అనుమానాస్పదంగా మహిళల సంచారం

పెనుబల్లి: పెనుబల్లి బీసీ కాలనీలో మసీదు సమీపంలో ఆదివారం గుర్తు తెలియని ఇద్దరు మహిళలు సంచరిస్తుండగా గ్రామస్తులు గుర్తించి స్థానికులు విచారించగా వారు ఉడాయించారు. పాఠశాలలకు సెలవు కావడంతో కాలనీలోని ఎక్కువ మంది చిన్నారులు పల్లెప్రకృతి వనం, మసీదు ప్రాంతాలలో ఆడకుంటున్న సమయంలో ఆ మహిళల చేతులలో బిస్కెట్లు, చాక్లెట్లు ఉండటం స్థానికులు గమనించి అడగగా పొంతనలేని సమాధానాలు చెప్పి అక్కడి నుండి వెళ్లిపోయారు. అనంతరం వారి కోసం గ్రామమంతా గాలించినా దొరకలేదు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి


మాట్లాడుతున్న సత్యనారాయణ

వైరా: ప్రభుత్వం కలిపిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పదో తరగతి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టర్ కస్తాల సత్యనారాయణ అన్నారు. వైరాలోని ప్రభుత్వ షెడ్యూలు కులాల అభివృద్ధి శాఖ బాలుర వసతి గృహంలో పదోతరగతి విద్యార్థులకు ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. ఏఎస్‌సీడీఓ కొత్త వెంకటేశ్వరరావు, ట్యూటర్‌లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ శకుంతల

కారేపల్లి: కారేపల్లి మండల పరిషత్ సమావేశం ఆదివారం సాదాసీదాగా సాగింది. సమావేశం కోరం పూర్తికావడమే గగనంగా మారిన సమయంలో తూతూ మంత్రంగా సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ మాలోత్ శకుంతల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీటీసీలు పెద్దబోయిన ఉమాశంకర్, ధారావత్ పాండ్యానాయక్‌లు ఎక్సైజ్ శాఖ సమీక్షా సందర్భంగా మండలంలోని నాలుగు మద్యం షాపు యజమానులు సిండికేట్‌గా మారి అధిక ధరలకు విక్రయాలు సాగిస్తున్నారని దీనిపై చర్యలేవని ఎస్సై వసంతలక్ష్మిని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన ఎస్సై ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రేషన్‌షాపులకు సంబంధింత సమయపాలన పాటించడం లేదని ఎంపీటీసీ సమావేశంలో లేవనెత్తగా దానిపై స్పందించిన డీటీ కె.లక్ష్మీ డీలర్లకు సూచనలు చేయడంతో పాటు తనిఖీలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, ఎంపీఓ పర్విన్ పాల్గొన్నారు.

ఆస్పత్రి తరలింపును విరమించాలి


మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: వైరా నియోజకవర్గ కేంద్రం నుంచి 100 పడకల అస్పత్రిని తరలించాలనే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం వైరా సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన స్టడీ సర్కిల్‌లో ఆయన మాట్లాడుతూ... వైరా నియోజకవర్గ కేంద్రాన్ని వైద్య, విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. మున్సిపాలిటీగా, నియోజకవర్గ కేంద్రంగా అప్‌గ్రేడ్ కాకముందే వైరాలో 100 పడకల అస్పత్రికి ప్రతిపాదనలు ఉన్నాయన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం నియోజకవర్గ కేంద్రంలో కాకుండా మరో చోటికి అస్పత్రిని తరలించడానికి ప్రయత్నాలు చేస్తుందని, ఇది సరికాదన్నారు. నాయకులు తోట నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బొంతు సమత, పారుపల్లి చంద్రశేఖర్, మందడపు రామారావు, అమరేంద్ర, మధు, రామకృష్ణ, ప్రేమ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి


తల్లాడ: మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

తల్లాడ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వర్‌రావు అన్నారు. తల్లాడ జీఎస్‌ఆర్ గార్డెన్‌లో మండల బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చిర్రా లింగయ్య అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ముదాం శ్రీనువాసరావు, శీలం సత్యానారాయణరెడ్డి, అయినాల రామలింగేశ్వర్‌రావు, సీఐటీయూ మండల కార్యదర్శి శేఖర్, మంగళగిరి కాంతారావు పాల్గొన్నారు.


కొణిజర్ల: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొణిజర్ల: ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ నాయకులు షేక్ ఖాసీం పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని రామనర్సయ్య నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన భారత్ బంధ్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌లను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పఠాన్ ఖాసీమ్ ఖాన్,, ఆంగోత్ బాషా, కోయిడ వెంకటేశ్వర్లు, ఇస్లావత్ కృష్ణ, అనంతరామయ్య పాల్గొన్నారు.

దుస్తులు పంపిణీ


మధిరరూరల్: దుస్తులు పంపిణీ చేస్తున్న కొండయ్య బృందం

మధిరరూరల్: మండలపరిధిలోని మాటూరుపేట, నిదానపురం గ్రామాల మధ్య పంట పొలాల్లో గుడారాలు వేసుకొని నివసిస్తున్న వలస కూలీలకు ఆదివారం ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు. ప్రముఖ సామాజిక సేవకులు లంకా కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ ఉచిత పాత దుస్తుల సేకరణ కేంద్రం నుంచి దాతల ద్వారా సేకరించిన పాత దుస్తులను నిరుపేదలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలను ఏ విధంగానైనా చేయవచ్చునని, ప్రతీ ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ నరేష్, ధనిశెట్టి రాము, భాస్కరరావు, చిలివేరు శాంతయ్య, మేడేపల్లి శ్రీనివాసరావు, వెంకటరమణ, చిన్నం శ్రీనివాసరావు, ధరణి, వెలివెల శ్రీధర్ స్థానికులు తదితరులు పాల్గొన్నారు.


సత్తుపల్లిరూరల్: విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఇంగ్లిష్ అధ్యాపకురాలు డి.ప్రమీల

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పేద విద్యార్థినులకు ఆదివారం ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా మహిళా సెక్రటరీ, కల్లూరు కళాశాల ఇంగ్లీష్ అధ్యాపకురాలు డి.ప్రమీల దుస్తులు పంపిణీ చేశారు. అదేవిధంగా రూ.10వేలు విలువైన శానిటరీ న్యాప్‌కిన్స్, బర్నర్ అందించనున్నట్లు తెలిపారు. పావని, నవ్యశ్రీ విద్యార్థినులకు చదివిస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ఎస్‌కె.రజియాసుల్తాన, సత్యనారాయణ, కృష్ణవేణి, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

పలువురిపై కేసు నమోదు

కారేపల్లి: చేపల సొసైటీ వివాదంలో పలువురిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. ఎస్సై పుష్పాల రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మేకలతండాకు చెందిన బానోత్ అనిల్ చేపల సొసైటీలో తన పేరు నమోదు చేయాలని అదే గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ బానోత్ హనుమను వేధించాడు. అంతేకాక ఇంటి మీదకు వెళ్లి దాడి చేసి చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడని హనుమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బానోత్ అనిల్ తన సహచరులైన బానోత్ మంగీలాల్, రాజేష్, శంకర్, రాములు, భద్రిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష


పరీక్షకు వచ్చిన విద్యార్థులతో తల్లిదండ్రులు

ఏన్కూరు: స్థానిక గురుకుల విద్యాలయంలో నిర్వహించిన ఐదో తరగతి విజిసెట్ ప్రవేశపరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షలకు చీఫ్ సూపరిండెంట్‌గా టి.శ్రీనివాసరెడ్డి, డిపార్టుమెంటల్ అధికారిగా కావూరి పద్మ, సిట్టింగ్ స్కాడ్‌గా షేక్ యాకూబ్ వ్యవహరించారు.